# మాతృప్రేమ మాధుర్యం వర్ణనాతీతం

"చందనపు చెక్కను అరగదీసినకొలదీ అది సుగంధాన్ని అందిస్తూ ఉంటుంది. చెఱకును నమిలినకొలదీ అది మధురంగా ఉంటుంది. బంగారమును కాల్చినకొలదీ దాని వన్నె హెచ్చి అది మరింత కాంతివంతంగా ప్రకాశిస్తుంది. అటులనే విశాల హృదయుడైన మానవుడు ఎన్ని కష్టములు, నష్టములు, దుఃఖములు ఎదురైనప్పటికీ వాటికి తట్టుకొని, నెట్టుకొని పరమశాంతితో పరమాత్మను స్మరిస్తాడేగాని, పరమాత్మను విస్మరించడు."

ప్రేమస్వరూపులారా! ప్రాచీన కాలమునుండి భారతీయులు తల్లీబిడ్డల సంబంధం అత్యంత మధురమైనదిగా, అమృతమయమైనదిగా భావిస్తూ వచ్చారు.

**కౌసల్యసతి శుక్తి గర్భమౌటను గదా**
**రాముడు దేవుడై రమణ గాంచె**
**సీతామహాసాధ్వి చెలగి పెంచుట గదా**
**కవలు కుశలవులు ఘనులు అగుట**
**జిజియాబాలామ చెలగి పెంచుట గదా**
**వీర శివాజియు పేరు గాంచె**
**పుతలీబాయి రంజిల్లి పెంచుట గదా**
**గాంధీ మహాత్ముడై ఘనత గాంచె**

భూమిలో వేపవిత్తులను నాటితే వేప ఫలములే లభిస్తాయి; మామిడి విత్తులను నాటితే మామిడి ఫలములే లభిస్తాయి. భూమి ఒక్కటే, విత్తులు వేర్వేరు. మనం ఎట్టి విత్తులను నాటితే అట్టి ఫలములనే అందిస్తుంది భూదేవి. తల్లిగర్భము భూదేవితో సమానం. తల్లిదండ్రుల సంకల్పాలు ఎలాంటివో అలాంటి పిల్లలే కల్గుతారు. తల్లి చాలా ఉత్తమురాలు. తల్లిగర్భమునందు జన్మించిన ప్రతి మానవుడు అదృష్టవంతుడే. "జంతూనాం నరజన్మ దుర్లభం" కనుక మానవుడు పవిత్రమైన భావాలను, ఆనందమయమైన హృదయాన్ని కల్గియుండి తన జన్మను సార్థకం గావించుకోవాలి.

sri sathyasai vachanamrutam

## గాంధీకి తల్లి నేర్పిన గుణపాఠం

గాంధీతల్లియైన పుతలీబాయి ఒక వ్రతము నాచరించేది. కోయిలకూత వినిన తరువాతగాని ఆమె భోజనం చేసేది కాదు. ఒకనాడు చాలా సేపటివరకు కోయిల కూయలేదు. తల్లి భోజనానికి ఆలస్యం అవుతోందని గమనించి పిల్లవాడైన గాంధీ ఇంటి వెనుకకు వెళ్ళి కోయిలవలె కూసి, వెంటనే లోపలికి వచ్చి "అమ్మా! కోయిలకూత విన్నావు కదా! ఇక నీవు భోజనం చేయవచ్చు" అన్నాడు. తన తల్లిపట్ల ప్రేమతో, ఆమె త్వరగా భోజనం చేయాలనే సదుద్దేశ్యంతోనే ఈ పని చేశాడు. కాని గాంధీ అసత్యం చెబుతున్నాడని గ్రహించి తల్లి చాలా బాధపడింది. "నేనే పాపం చేశానోగాని, నా గర్భంలో అసత్యమాడే కుమారుడు జన్మించాడు. నేనెంతటి దురదృష్టవంతురాలను!" అని కన్నీరు కార్చింది. కుమారుని చెవి మెలిపెట్టి రెండు కొట్టి, అసత్యమాడినందుకు మందలించింది. తానింకెన్నడూ అసత్యమాడనని గాంధీ తల్లికి వాగ్దానం చేశాడు. తల్లికిచ్చిన మాటననుసరించి సత్యవాక్పరిపాలన చేయటంచేత గాంధీ ఉత్తమమైన కీర్తిని పొందాడు.

పుతలీబాయివద్ద రంభ అనే సేవకురాలు ఉండేది. "యథా రాజా తథా ప్రజా" అన్నట్లు, ఆమెకూడా తన యజమానురాలివలె పవిత్రమైన హృదయం కల్గినది. ఒకనాడు ఆమెవద్దకు పిల్లవాడైన గాంధీ పరుగెత్తుకొని వచ్చి "రంభా! నాకు చాలా భయంగా ఉంది" అన్నాడు. అప్పుడామె "నాయనా! భగవంతుడైన శ్రీరామచంద్రుడు మనచెంతనుండగా భయమెదుకు? నీకు భయమనిపించి నప్పుడల్లా రామనామమును స్మరించు. తప్పక నీ భయం తొలగిపోతుంది" అని చెప్పింది. ఆనాటినుండి గాంధీ తన తుదిశ్వాస వదిలేంతవరకు రామనామ స్మరణ చేస్తూవచ్చాడు.

తల్లి పవిత్రమైన మార్గాన్ని అనుసరించినప్పుడు పిల్లలుకూడా పవిత్రమైన స్థితిని పొందుతారు. శంకరులవారి తల్లి ఆర్యాంబ. ఆమె నిరంతరం ఈశ్వరారాధన సల్పేది, శివనామాన్ని స్మరిస్తూ ఉండేది. నిత్యమూ శివలింగానికి అభిషేకం చేసి, ఆ తీర్థమును తాను పుచ్చుకొని కుమారునికి కూడా ఇచ్చేది. ఇట్టి పవిత్ర హృదయురాలైన ఆర్యాంబ గర్భమున జన్మించటంచేతనే శంకరులవారు జగద్గురువుగా ప్రసిద్ధి చెందారు.

sri sathyasaivachanamrutam

## "మొదలు అమ్మకు..."

రంగూన్ యుద్ధం జరిగినప్పుడు ఒక తల్లి, ఆమె కుమారుడు అక్కడినుండి తప్పించుకొని మద్రాసుకు చేరుకున్నారు. మద్రాసులో వారికి తెలిసినవారెవ్వరూ లేరు; తినటానికి తిండి లేదు; నిలువటానికి నీడ లేదు. "నేనెలాంటి కష్టాన్నైనా తట్టుకోగలను. కాని, నా కుమారుడెలా తట్టుకోగలడు?" అని ఆమె చింతించింది. మాతృప్రేమ యొక్క మాధుర్యం ఇట్టిది, అట్టిది అని ఎవ్వరూ వర్ణించలేరు. తల్లీకొడుకులు ఒక బస్టాండులో నివాసమేర్పర్చుకున్నారు. ప్రతి రోజూ తల్లి ఇంటింటికీ పోయి భిక్షమెత్తి, మొదలు కుమారునికి పెట్టి మిగిలింది తాను తినేది. ఒక్కొక్క రోజున ఆమెకు తినటానికి ఏమీ మిగిలేది కాదు. తత్ఫలితంగా క్రమక్రమేణ ఆమె ఆరోగ్యం క్షీణించిపోయింది. తల్లియొక్క ఆరోగ్య పరిస్థితిని గుర్తించి కుమారుడు "అమ్మా! ఇంతకాలం నీవు నన్ను పోషించావు. ఇకమీదట నిన్ను పోషించటం నా కర్తవ్యం. నీవు ఇంటివద్దనే ఉండు. నేను భిక్షాటనకు వెళతాను" అన్నాడు. ఆనాటినుండి ఆ పిల్లవాడు ఇంటింటికీ పోయి భిక్షమెత్తి మొదలు తల్లికి పెట్టి, మిగిలింది తాను తినేవాడు. ఒక్కరికి మాత్రమే సరిపడేంత ఆహారం లభించిన రోజున తల్లికి పెట్టి తాను పస్తుండేవాడు. కొంతకాలానికి తానుకూడా నీరసించిపోయాడు. ఒకనాడతడు ఒక ఆఫీసరు ఇంటి ముందు నిలబడి "అయ్యా! ఆకలి, ఆకలి" అన్నాడు. ఆ సమయంలో ఆ ఆఫీసరు వరండాలో ఈజీఛైర్‌పై కూర్చుని న్యూస్‌పేపర్ చదువుతున్నాడు. "నాయనా! ఇక్కడే కూర్చో. నీకు ఆకు వేసి అన్నం పెడతాను" అంటూ ఆయన లోపలికి వెళ్ళి ఒక ఆకులో అన్నం తీసుకువచ్చాడు. "నేనిక్కడ తినను, ఇంటికి తీసుకు వెళతాను" అన్నాడా పిల్లవాడు. "నిజంగా నీకు ఆకలిగా ఉంటే ఇక్కడే భోజనం చేయవచ్చు కదా! ఇంటికి తీసుకువెళ్ళటమెందుకు?" అంటూ ఆ పిల్లవానిని అక్కడే కూర్చుని తినవలసిందిగా ఆయన బలవంతం చేశాడు. ఉన్నట్లుండి ఆ పిల్లవాడు నీరసంతో తల తిరిగి క్రిందపడిపోయాడు. ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నాడుగాని, గట్టిగా చెప్పలేక పోతున్నాడు. అతడేమి చెబుతున్నాడో వినాలని ఆ ఆఫీసరు అతని నోటి దగ్గర తన చెవిని పెట్టాడు. ఆ పిల్లవాడు "మొదలు అమ్మకు, మొదలు అమ్మకు..." అంటూ ప్రాణం వదిలాడు. అప్పుడు ఆయనకు ఆ పిల్లవాని మాతృప్రేమ ఎంత గొప్పదో అర్థమైంది. "తల్లికోసం జీవితాన్నే త్యాగం చేసిన ఈ పిల్లవాడెంతటి ధన్యుడో! ఇలాంటి సత్పుత్రుణ్ణి కన్నటువంటి ఆ తల్లి ఎంతటి అదృష్టవంతురాలో!" అనుకున్నాడు.

srisathyasaivachanamrutam

## ఈశ్వరచంద్రవిద్యాసాగర్ ఆదర్శం

ఈశ్వరచంద్రవిద్యాసాగర్, అతని తల్లి కలకత్తాకు సమీపంలోని ఒక కుగ్రామంలో నివసించేవారు. వారు చాలా బీదవారు. అయితేనేమి, అతడు గొప్ప గుణవంతుడు. అతని తల్లికూడా చాలా ఉన్నతమైన ఆశయాలు కల్గినది. ఆమె తరచుగా తన కుమారుణ్ణి దగ్గర కూర్చోబెట్టుకుని "నాయనా! స్వార్థదృష్టితో చదివే చదువు చదువు కాదు. నీవు పదిమందికి ఉపయోగపడే చదువు చదవాలి. నీవు నీ విద్యను దేశోద్ధరణకోసం వినియోగించాలి" అని బోధించేది. విద్యాసాగర్ తల్లియొక్క ఆశయాలను ఆచరణలో పెట్టటానికి కృషి చేశాడు. ఇంట్లో దీపం లేకపోవటంచేత రాత్రిపూట బస్టాండులోనో, వీధిదీపాల క్రిందనో కూర్చుని చదువుకునేవాడు. ఈరీతిగా కష్టపడి చదివి తల్లియొక్క ఆశీస్సులతో అభివృద్ధికి వచ్చాడు.

విద్యాసాగర్ ఉద్యోగంలో చేరిన కొద్దిరోజులకు ఆ గ్రామంలో ఒక తిరునాళ్ళు జరిగింది. ఆ ఉత్సవానికి అనేకమంది శ్రీమంతులు మంచి దుస్తులు, నగలు ధరించి వెళుతుంటే తన తల్లి మాత్రం ఒక పాతచీర కట్టుకొని వెళ్ళటం చూసి విద్యాసాగర్ చాలా బాధపడ్డాడు. తన మొదటి జీతం వచ్చిన తరువాత ఆ డబ్బును తెచ్చి తన తల్లి పాదాలవద్ద ఉంచి "అమ్మా! నీవు ఒక్కటైనా మంచిచీర కొనుక్కోవాలి" అని ప్రార్థించాడు. అప్పుడామె "నాయనా! నాకు ఖరీదైన చీరలు, నగలు అక్కర్లేదు. నీవు చక్కగా అభివృద్ధికి వచ్చి మంచి పేరు తెచ్చుకో, నాకంతే చాలు. అయితే నాకు కొన్ని కోరికలున్నాయి. కాని, ఇప్పుడు చెప్పను; తగిన సమయం వచ్చినప్పుడు చెబుతాను" అన్నది.

క్రమక్రమేణ అతడు ఉన్నత స్థితికి వచ్చాడు. అతని జీతంకూడా పెరిగింది. ఒకనాడతడు తల్లితో "అమ్మా! ఇప్పుడు నావద్ద కావలసినంత డబ్బున్నది. నీ కోరికలేమిటో చెప్పు, తప్పక తీరుస్తాను" అన్నాడు. అప్పుడామె అతనిని దగ్గర కూర్చోబెట్టుకొని "నాయనా! నీవెంతటి గొప్ప విద్యావంతుడవైనప్పటికీ తల్లికి కుమారుడవే. కాబట్టి నేను వాత్సల్యభావంతో చెబుతున్నాను. నా మాటలను శ్రద్ధగా ఆలకించు. మన గ్రామం చాలా చిన్నది. ఇక్కడ కనీసం ఒక చిన్న పాఠశాలయైనా లేకపోవటంచేత పిల్లలు విద్యాబుద్ధులు నేర్చుకోవటానికి అవకాశం

srisathyasaivachanamrutam

లేకపోతున్నది. కాబట్టి నీవొక వీధిబడిని కట్టించు; పిల్లలు అంతో, ఇంతో అభివృద్ధికి రాగలరు" అన్నది. తల్లికోరిక మేరకు విద్యాసాగర్ ఆ గ్రామంలో ఒక చిన్న బడిని కట్టించాడు. మరి కొంతకాలమైన తరువాత అతడు తల్లితో "అమ్మా! నీవు కోరినట్లు ఒక చిన్న బడిని కట్టించాను. నీకింకా ఏమైనా కోరికలుంటే చెప్పు" అన్నాడు. అప్పుడామె "నాయనా! మన గ్రామంలో ఎవరికైనా దగ్గు, పడిశం, జ్వరం వస్తే ఇంత మందిచ్చే దిక్కు లేదు. కాబట్టి, ఒక చిన్న ఆసుపత్రిని కట్టించు" అని కోరింది. తల్లికోరిక ప్రకారం అతడొక ఆసుపత్రినికూడా కట్టించాడు.

## ఈశ్వరమ్మ కోరిన మూడు కోరికలు

ఈశ్వరమ్మకూడా ఇదేవిధమైన కోరికలు కోరింది. సాయివైభవం క్రమక్రమేణ విస్తరిస్తున్న రోజుల్లో ఒకనాడు ఆమె "స్వామీ! మన గ్రామంలో ఒక చిన్న పాఠశాలయైనా లేకపోవటంచేత పిల్లలు చాలా ఇబ్బందికి గురి అవుతున్నారు. చదువు నిమిత్తం చిన్నచిన్న పిల్లలు బుక్కపట్నానికి నడిచి వెళుతున్న దృశ్యం చూస్తుంటే నా హృదయం ద్రవిస్తోంది. కాబట్టి మన గ్రామంలో ఒక చిన్న స్కూలును కట్టించండి" అని కోరింది. ఆమె కోరిక ప్రకారం ఒక స్కూలును కట్టించాను. తరువాత "స్వామీ! మన గ్రామంలో చిన్నపిల్లలకేమైనా జ్వరం వచ్చిందంటే చికిత్సకోసం బుక్కపట్నం వెళ్ళవలసివస్తోంది. తల్లులు ఆ పిల్లలను ఎత్తుకొని అంతదూరం నడచి వెళ్ళటం చూస్తే నాకు చాలా బాధగా ఉన్నది. కాబట్టి ఇక్కడొక చిన్న ఆసుపత్రిని కట్టించండి" అని కోరింది. ఆసుపత్రిని కూడా కట్టించాను. ఆ చిన్న స్కూలే ఈనాడు యూనివర్సిటీగా తయారయింది. ఆనాటి చిన్న ఆసుపత్రియే ఈనాడు పెద్ద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా రూపొందింది.

తల్లియొక్క సత్యసంకల్పము, సాయియొక్క నిత్యసంకల్పము రెండింటియొక్క కూడికచేతనే ఇది సాధ్యమైంది. కట్టకడపటికి ఆమె ప్రాణం విడిచేముందు మరొక కోరిక కోరింది. "స్వామీ! మన గ్రామప్రజలు నీటికోసం చాలా అవస్థ పడుతున్నారు. లోతు బావి నుండి నీళ్ళు చేదుకొనలేక వాళ్ళ రెక్కలు ముక్కలౌతున్నాయి. కాబట్టి నీటి సదుపాయంకూడా కల్పించండి" అని కోరింది. అప్పటి పరిస్థితికి తగినట్లుగా నీటిసదుపాయం కల్పించి ఆమెను సంతృప్తిపరచాను. ఇప్పుడు వాటర్ సప్లై ప్రాజెక్టు చేపట్టి జిల్లా అంతటికీ నీరందిస్తున్నాను.

sri sathyasai vedamrutam

## ఈశ్వరమ్మ ఇప్పటికీ సజీవంగా సంచరిస్తోంది

లోకంలో తల్లిప్రేమను మించిన ప్రేమ లేదు. మీకు తెలుసో లేదోగాని, ఇప్పటికీ ఆ తల్లియొక్క ప్రేమ ప్రత్యక్షంగా కనిపిస్తూనే ఉన్నది. తాను శరీరం వదలిపెట్టి ముప్ఫై సంవత్సరాలైనప్పటికీ ఈశ్వరమ్మ ఇప్పటికీ సజీవంగా సంచరిస్తోంది. అప్పుడప్పుడు నాదగ్గరకు వచ్చి కొన్ని విషయాలు చెప్పి పోతుంటుంది. "స్వామీ! మీరు ఎవరు పడితే వారి వద్ద కర్ఛీఫ్ తీసికొని దానితో మొహం తుడుచుకుంటారు. అలా అందరూ ఇచ్చే కర్ఛీఫ్‌లు ముట్టకండి" అన్నది. "వారు భక్తితో ఇచ్చినప్పుడు ముట్టకుండా ఎలా ఉండగలను?" అన్నాను. అప్పుడు ఆమె చెప్పింది – "స్వామీ! భక్తులు చాలామంది ఉన్నారు, అలాంటి మహనీయులు కోట్లకొలది ఉన్నారు. కాని దుర్భావంతో, దురుద్దేశ్యంతో కర్ఛీఫ్‌లందించేవారుకూడా కొంతమంది ఉన్నారు. కాబట్టి మీరు జాగ్రత్తగా ఉండాలి" అన్నది. 'ఎందుకోసం?' అని అడిగాను. "కొంతమంది కర్ఛీఫ్‌కు విషం పూసి ఇస్తారు. అది పెదవులకు కాస్త తగిలితే చాలు, ప్రాణం తీస్తుంది. ఇలాంటి సంఘటనలు ప్రపంచంలో ఎన్నోచోట్ల జరుగుతున్నాయి. కాబట్టి మీరు ఇతరులనుండి కర్ఛీఫ్‌లు తీసుకోకండి" అని కోరింది. "సరే నీ ఇష్టప్రకారమే చేస్తాను" అన్నాను.

ఇప్పటికీ ఈశ్వరమ్మ అప్పుడప్పుడు నా గదిలోకి వస్తుంటుంది. నా గదిలో పడుకునే పిల్లలకుకూడా ఈ సంగతి తెలుసు. ఆమె వచ్చి నాతో మాట్లాడుతుంటే వీళ్ళు లేచి కూర్చుంటారు. ఒకరోజున నా గదిలో ఉండే పిల్లలను అడిగాను – "నాయనా! నాది పట్టుపంచె కాబట్టి, గట్టిగా కట్టుకోవటానికి వీలుకాకుండా ఉన్నది. నాకొక బెల్టు కావాలి." కాని, వారిచ్చిన బెల్టుకున్న ఔతిబీదిజిలి బాగా మెరుస్తూ ఉండినది. అది నా చొక్కా లోపలినుండి బయటికి కనిపిస్తుంది. దానిని చూసినవారు సాయిబాబా బంగారుబెల్టు వేసుకున్నాడని అనుకుంటారు. కాబట్టి నాకు అలాంటి బెల్టు అక్కర్లేదన్నాను.

ఒకనాడు తెల్లవారుజామున ఈశ్వరమ్మ నాగదికి వచ్చింది. ఆమె వచ్చి మాట్లాడుతుంటే సత్యజిత్తు, సాయినాథ్, శ్రీనివాస్ వీరందరూ లేచి కూర్చున్నారు. "స్వామీ! ఎవరూ మీ గదిలోకి ప్రవేశించటానికి వీలుకాదే! క్రింద లిఫ్టుకు బీగం వేశామే! ఎవరు వచ్చారు? మీరు ఎవరితో మాట్లాడుతున్నారు?" అని అడిగారు. అప్పుడు చెప్పాను – "గృహంఅమ్మాయి (ఈశ్వరమ్మ)

sri sathyasai vachanamrutam

వచ్చింది. ఇదిగో, దీనిని నాకిచ్చి వెళ్ళింది" అని ఆ బెల్టును చూపించాను. దానికి ఔతిబీదిజిలి లేదు; అతికిస్తే అతుక్కుంటుంది. ఈశ్వరమ్మ నా తల్లి కావాలని నేనే సెలెక్ట్ చేసుకున్నాను. ఆమెకు, నాకు మధ్య గల సన్నిహిత సంబంధ బాంధవ్యం అలాంటిది.

**పరమ భక్తాగ్రేసరుడు చైతన్య మహాప్రభువు**

ఒనానొక సమయంలో చైతన్యమహాప్రభువు దేవాలయానికి వెళ్ళి ఈరీతిగా ప్రార్థించాడు – "స్వామీ! నీవు లోకనాథుడవు, ప్రాణనాథుడవు, సర్వజ్ఞుడవు, సర్వవ్యాపకుడవు, సర్వశక్తిమయుడవు. నేనేది కోరినా ఈయగలవు. కాని నాకు ఎలాంటి వాంఛలూ లేవు. ధనకనక వస్తు వాహనాదులను నేనేనాడూ కోరలేదు. భక్తిముక్తులను నేను ఆశించటం లేదు. నీపై ప్రేమను నాకు ప్రసాదించు. నేను నిన్ను ప్రేమిస్తే చాలు. నీ ప్రేమను మించినది ఈ లోకంలో మరొకటి లేదు." అట్టి ప్రేమను కోరటంచేతనే చైతన్యుడు భగవత్ప్రేమతత్త్వాన్ని ప్రపంచమంతా ప్రచారం చేయగల్గాడు. "దైవాన్ని స్మరించండి. నిరంతరం దైవచింతన చేయండి. ఈ లోకంలో దైవం తప్ప అన్యం లేదు" అని ప్రజలకు ప్రబోధిస్తూ వచ్చాడు.

వివాహం చేసుకోవలసిందిగా తల్లి చైతన్యుణ్ణి చాలా బలవంతం చేసింది. "నాయనా! నీవు ఈ వయస్సులో ఈ ప్రపంచంలో ఒంటరిగా తిరగటం మంచిది కాదు. లక్ష్మి అనే ఒక అమ్మాయి ఉంది. ఆమె గొప్ప భక్తురాలు, వినయసంపన్నురాలు, మంచి కుటుంబానికి చెందినది. కాబట్టి ఆమెను వివాహమాడు" అని చెప్పింది. కాని, చైతన్యుడు తనకు వివాహం అక్కర్లేదన్నాడు. "భగవంతుడే నాకు తోడు. నా జీవితాన్ని భగవంతునికే అర్పితం చేశాను" అన్నాడు. తల్లి "నాయనా! నీవు నీ మనస్సును భగవంతునికి అర్పించి యుండవచ్చు. కాని నీకు శరీరముంది కదా! మనిషికి ఆధ్యాత్మికం, భౌతికం రెండూ అవసరమే. కాబట్టి నీవు వివాహం చేసుకునే తీరాలి" అని బలవంతం చేసింది. లక్ష్మితో అతనికి వివాహం చేసింది. వివాహమైన తక్షణమే చైతన్యుడు భగవత్తత్త్వాన్ని ప్రచారం చేసే నిమిత్తం ఇల్లు వదలిపెట్టి వెళ్ళాడు. వెళ్ళినవాడు ఎన్ని నెలలైనా తిరిగి రాలేదు. అతని భార్యయైన లక్ష్మి చాలా పవిత్ర హృదయురాలు. ఆమె ప్రేమ నిర్మలమైనది, నిశ్చలమైనది, నిస్వార్థమైనది. నిరంతరము చైతన్యుని స్మరిస్తూ ప్రాణం విడిచింది. చైతన్యుడు ఇంటికి తిరిగి వచ్చాడు. తల్లి అతని చేతులు పట్టుకొని "నాయనా! నా

sri sathyasai vachanamrutam

బలవంతంమీద నీవు వివాహమాడావు. కాని, నేను ఆ అమ్మాయి ప్రాణాలను కాపాడుకోలేక పోయాను. అంతటి గుణవంతురాలు లభించటం చాలా కష్టం" అన్నది. తరువాత విష్ణుప్రియ అనే అమ్మాయితో అతనికి మళ్ళీ వివాహం చేసింది. వివాహం తరువాత చైతన్యుడు మళ్ళీ భగవత్తత్త్వ ప్రచార నిమిత్తం ఇల్లు విడిచి పెట్టాడు. "నాకు కావలసింది దైవం ఒక్కడే. దైవచింతన తప్ప అన్యచింతనలు నాకక్కర్లేదు" అని భావించాడు.

## భక్తి - దైవశక్తి

చైతన్యుడు చిడతలు పట్టుకొని భజన చేస్తూ వీథులలో తిరుగుతుంటే కొందరు అసూయాపరులు ఆ చిడతలను లాక్కున్నారు. తరువాత అతడొక మద్దెలను మెడకు తగిలించుకొని, దానిని వాయిస్తూ భజన చేస్తుంటే కొందరు రౌడీలు దానినికూడా పగలగొట్టారు. అయినప్పటికీ అతడేమాత్రం చలించలేదు. "ఆహా! నాకీ బంధనకూడా తొలగిపోయింది. ఈ చిడతలు, మద్దెల నాక్కర్లేదు. నాకు భగవంతుడు ప్రసాదించిన చేతులు భద్రంగా ఉన్నాయి కదా! ఇవి చాలు" అని భావించి, చేతులతో తాళం వేస్తూ భజన చేయటం ప్రారంభించాడు. కొందరు దుండగులు అతనిని పట్టుకొని బాగా కొట్టారు. అప్పుడుకూడా అతడు కృష్ణనామాన్ని స్మరిస్తూనే ఉన్నాడు. వాళ్ళు కొట్టిన దెబ్బలకు అతని ఒళ్ళంతా రక్తసిక్తమైంది. అయితే తల్లి వచ్చి చూసేసరికి అతని ఒంటిమీద ఒక్క రక్తపు మరకకూడా లేదు; గాయాలన్నీ మటుమాయమయ్యాయి. "ఈ శరీరం భగవంతునిదేగాని, నాది కాదు" అని భావించాడతడు.

లోకంలో భగవత్తత్త్వాన్ని గుర్తించలేనివారు అనేక రకములైన భ్రాంతులలో మునిగిపోతుంటారు. నేను పాతమందిరంలో ఉన్న రోజుల్లో ఒకనాడు చాలా మంది గుంపులు గుంపులుగా అక్కడికి వచ్చారు. ఈశ్వరమ్మ మెల్లగా నావద్దకు వచ్చి "స్వామీ! వీళ్ళు చాలా చెడ్డమనుష్యులవలె కనిపిస్తున్నారు. మీకేమైనా అపకారం చేస్తారేమో అన్న భయంతో నాకు నిద్ర పట్టటం లేదు" అన్నది. అప్పుడు నేను "నేవిలాంటి భయానికి చోటివ్వకు. ఏనాటికైనా దేహాన్ని వదలక తప్పదు. కాబట్టి, దేహాభిమానాన్ని వదలిపెట్టు" అన్నాను. ఆమెకు ధైర్యం చెప్పి ఇంటికి పంపించాను. అదొక పాత గడ్డికొట్టం. అందులో నేనొక్కడినే పడుకున్నాను. ఆనాటి రాత్రి ఆ ఇంటికి నాల్గు వైపులనుండి నిప్పు అంటించారు. మంటలు రగుల్కొని ఉవ్వెత్తున

sri sathyasai vachanamrutam

ఎగిశాయి. సుబ్బమ్మ, ఈశ్వరమ్మ పరుగెత్తి వచ్చారు. వాళ్లు వచ్చేసరికి ఎక్కడా లేని వర్షం ఆ ఇంటిపైన కుండపోతగా కురిసి మంటలను ఆర్పివేసింది. నేను బయటికి వచ్చాను. నన్ను చూసి ఈశ్వరమ్మ, సుబ్బమ్మలు "స్వామీ! మీరు క్షేమంగా ఉన్నారు. మాకంతే చాలు" అంటూ ఆనందబాష్పాలు రాల్చారు.

కౌరవపాండవుల మధ్య సంధి కుదర్చటానికి కృష్ణుడు కౌరవులవద్దకు రాయబారిగా బయల్దేరే ముందు ధర్మజుని కలుసుకొని అతని అభిప్రాయ మడిగాడు. ధర్మజుడు "స్వామీ! మీరెక్కడ! దుర్మార్గులైన ఆ కౌరవులెక్కడ! వారివద్దకు మిమ్మల్ని రాయబారిగా పంపించటం నాకిష్టం లేదు" అన్నాడు. తరువాత కృష్ణుడు అర్జునునివద్దకు వెళ్ళి "అర్జునా! కౌరవులతో మీకు సంధి కుదర్చటానికి నేను వెళ్ళటం నీకిష్టమేనా?" అని అడిగాడు. రజోగుణ ప్రధానుడైన అర్జునుడు కృష్ణుణ్ణి తప్పక వెళ్ళి యుద్ధానికి ఒప్పుకొని రమ్మన్నాడు. భీముడు కూడా అతని అభిప్రాయంతో ఏకీభవించాడు. తరువాత కృష్ణుడు ద్రౌపదివద్దకు వెళ్ళాడు.

స్త్రీల హృదయం చాలా సున్నితమైనది, పవిత్రమైనది. ఆమె "కృష్ణా! యుద్ధం జరిగితే ఇరువైపుల ఎంతోమంది బంధుమిత్రులు నశిస్తారు. కాబట్టి, ఈ యుద్ధం వద్దే వద్దు" అన్నది. తరువాత కృష్ణుడు నకులసహదేవులవద్దకు వెళ్ళి వారి అభిప్రాయమడిగాడు. కాని వారేమీ చెప్పలేక మౌనంగా ఉండిపోయారు. అక్కడినుండి కృష్ణుడు హస్తినాపురం వెళ్ళి ఆ గ్రుడ్డిరాజుతో సంభాషణ జరిపాడు. యుద్ధం వలదని కౌరవులకు ఎంతో నచ్చజెప్పాడు. కాని లాభం లేకపోయింది. కృష్ణుడు తిరిగి వస్తూనే చిన్నవారైన నకుల, సహదేవులు పట్టలేని ఆనందంతో కృష్ణుణ్ణి గట్టిగా కౌగిలించుకొని "కృష్ణా! మేము కోరింది ఇదే. మీరు ఆ దుర్మార్గుల వద్దకు వెళ్ళి క్షేమంగా తిరిగి వచ్చారు. మాకిదేచాలు. మీ క్షేమమే మా క్షేమం. ఇంక, మళ్ళీ వారివద్దకు వెళ్ళకండి" అన్నారు. ద్రౌపదికూడా అదే చెప్పింది. "అన్నా! ఆనాడు మీరు కౌరవుల వద్దకు వెళ్ళటానికి నా మనస్సు ఏమాత్రం అంగీకరించలేదు. స్త్రీలు బలహీనులని మీరు అనుకోవచ్చు. కాని, మేము బలహీనులం కాదు, దేనికైనా సిద్ధంగా ఉంటాము. స్వార్థాన్ని త్యాగం చేసి కుటుంబ క్షేమాన్ని ఆశిస్తాము. కనుకనే నేను మొదటినుండి యుద్ధం వద్దని చెప్పాను" అన్నది.

sri sathyasai vahini amrutam

## ద్రౌపది క్షమాగుణం

ద్రౌపదిలాంటి పవిత్ర హృదయులైన స్త్రీలే అనాది కాలమునుండి భారతీయ సంస్కృతిని పోషిస్తూ వచ్చారు. అశ్వత్థామ రాత్రికి రాత్రి వచ్చి నిద్రిస్తున్న ఉపపాండవుల గొంతులు కోసినప్పుడు అర్జునుడు అతనిని పట్టి బంధించి ద్రౌపది ముందు నిలబెట్టి "ద్రౌపదీ! నీ ఎదురుగానే వీని గొంతుకోస్తాను. ఆ రక్తంతో తలంటుకొని స్నానం చేయి" అన్నాడు. కాని ద్రౌపది ఏమి చేసింది? అశ్వత్థామ పాదాలపై పడి ఈరీతిగా పలికింది:

**పరగన్ మా మగవారలందఱును మున్ బాణప్రయోగోపసం**
**హరణాద్యాయుధ విద్యలన్నియును ద్రోణాచార్యుచే నభ్యసిం**
**చిరి; పుత్రాకృతి నున్న ద్రోణుడవు; నీ చిత్తంబులో లేశముం**
**గరుణాసంగము లేక శిష్యసుతులన్ ఖండింపగా బాడియే ?**

**ఉద్రేకంబున రారు; శస్త్రధరులై యుద్ధావనిన్ లేరు; కిం**
**చిద్ద్రోహంబును నీకు జేయరు; బలోత్సేకంబుతో జీకటిన్**
**భద్రాకారుల, బిన్న పాపల, రణప్రౌఢక్రియాహీనులన్,**
**నిద్రాసక్తుల సంహరింప నకటా! నీ చేతు లెట్లాడెనో?**

తన కుమారుల గొంతులు కోసిన దుర్మార్గుణ్ణి ఏ తల్లియైనా క్షమిస్తుందా? కాని, ద్రౌపది అశ్వత్థామను క్షమించి వదలిపెట్టవలసిందని అర్జునుణ్ణి ప్రార్థించింది. "ఇతడు నా బిడ్డలను చంపినందుకు నేనెంతగానో దుఃఖిస్తున్నాను. ఇప్పుడు నీవీతనిని చంపితే ఇతని తల్లికూడా నావలెనే తన బిడ్డకోసం ఎంతగా దుఃఖిస్తుందో కదా! తల్లికి దుఃఖాన్ని కల్గించకూడదు. కాబట్టి అర్జునా! ఇతనిని క్షమించి ప్రాణాలతో వదలిపెట్టు" అని కోరింది.

**క్షమ సత్యము, క్షమ ధర్మము**
**క్షమ వేదము, క్షమ అహింస, క్షమ యజ్ఞంబౌ**
**క్షమ సంతోషము, క్షమ స్వర్గము**
**క్షమ సర్వస్వము సర్వ లోకములన్**

sri sathyasai vahini amrutam

పాండవులు శూరులు, వీరులు, గంభీరులు. కాని ద్రౌపదిలో ఉన్న కరుణారసం వారిలో కనిపించలేదు. స్త్రీల హృదయం కరిగి ప్రవహించే అమృతరసం. కాని ఈ కలిప్రభావంచేత ఈనాడు స్త్రీలలో కూడా అట్టి ప్రేమ క్షీణించిపోయింది. అయితే ఈనాడుకూడా పవిత్రహృదయులు, పతివ్రతామతల్లులు లేకపోలేదు. వారి ప్రభావంవల్లనే భారతదేశం ఇంకా ఈమాత్రమైనా నిలువగల్గింది. దేశక్షేమం స్త్రీలపైననే ఆధారపడియున్నది. కాబట్టి స్త్రీలను చులకన చేయరాదు. పెద్దవారిని తల్లులుగా గౌరవించాలి, చిన్నవారిని సోదరీమణులుగా భావించాలి. మగవారు ఇట్టి పవిత్రభావంతో మెలగినప్పుడే దేశం క్షేమంగా ఉంటుంది.

**తల్లిదండ్రులను మరచినవాణ్ణి దేవుడైనా కాపాడలేడు**

ఒకానొక సమయంలో పార్వతీపరమేశ్వరులు లోకసంచారం సల్పుతూ, మార్గమధ్యంలో ఒక వ్యక్తి చెట్టు కొమ్మపై కూర్చొనియుండటాన్ని చూశారు. ఆ కొమ్మ ఏ క్షణంలోనైనా విరిగిపోవటానికి సిద్ధంగా ఉంది. ఈ విషయాన్ని గమనించి పార్వతి “నాథా! అతనిని రక్షించు” అని ప్రార్థించింది. అప్పుడు ఈశ్వరుడు “పార్వతీ! మొట్టమొదట చూసినదానివి నీవు. కాబట్టి నీవే రక్షించు. నేనెందుకు రక్షించాలి?” అన్నాడు తమాషాగా. “నాథా! నీ అనుగ్రహం లేకుండా నేనెలా రక్షించగలను? నేను నెగటివ్, నీవు పాజిటివ్. నీవు కూడా సంకల్పించు కున్నప్పుడే అతనిని రక్షించటానికి వీలౌతుంది. కాబట్టి, ఆలస్యం చేయకు” అని ప్రాధేయపడింది.

అప్పుడు ఈశ్వరుడు “పార్వతీ! కారణం లేని కార్యం జరగటానికి వీలుకాదు. అతడు మనల్ని కనీసం పిలవనైనా పిలవాలి కదా! పిలవకుండా ఎట్లా రక్షించేది? పిలవని పేరంటానికి ఎవరైనా వెళతారా?” అన్నాడు. అప్పుడు పార్వతి ఒక సలహా చెప్పింది. “ఈశ్వరా! నేను అమ్మను, నీవు అప్పవు. కాబట్టి వాడు క్రింద పడేటప్పుడు ‘అమ్మా!’ అంటే నేను వెళ్ళి రక్షిస్తాను; ‘అప్పా!’ అంటే నీవు వెళ్ళి రక్షించాలి” అన్నది. ఈశ్వరుడు అంగీకరించాడు. వాడు ఎవరిని పిలుస్తాడా అని ఇద్దరూ అక్కడ వేచియున్నారు. కాని, వాడు ‘అమ్మా!’ అనలేదు, ‘అప్పా!’ అనలేదు; ‘అయ్యో!’ అంటూ క్రిందపడి పోయాడు. ఎందుకంటే, జీవితంలో వాడేనాడూ తన అమ్మను, అప్పను పూజించినవాడు కాదు. కనుకనే వాడి నోటినుండి ‘అమ్మా!’ రాలేదు, ‘అప్పా!’ రాలేదు. తల్లిదండ్రులనే మరచిన మూర్ఖుణ్ణి ఏ దేవుడు రక్షిస్తాడు? జీవితకాలంలో

srisathyasaivachanamrutam

చేసిన స్మరణ అంత్యకాలంలో ఆదరణకోసమని.

తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవస్వరూపులని విశ్వసించి, వారికి తగిన కృతజ్ఞత నందించాలి. కుమారుడు ఎట్టివాడైనప్పటికీ తల్లి అతనిని ప్రేమిస్తుంది, అతని క్షేమాన్ని కోరుతుంది. తల్లీబిడ్డల మధ్య ఉంటే ప్రేమసంబంధమును వర్ణించటానికి వీలుకాదు. ఇట్టి తల్లిప్రేమను ఈనాటి పిల్లలు గుర్తించటం లేదు. వారు తమ స్వార్థ స్వప్రయోజనాలకై ప్రాకులాడుతున్నారేగాని, తల్లిదండ్రుల సుఖ సంతోషాలకై పాటుపడటం లేదు.

మాతృదేవియొక్క మాహాత్మ్యమును లోకానికి చాటే నిమిత్తమై ఈనాడు 'ఈశ్వరమ్మ డే' జరుపుకుంటున్నాము. ఎలాంటి పరిస్థితియందైనా మీ తల్లిదండ్రులకు దుఃఖం కల్గించకండి. సాధ్యమైనంతవరకు వారికి సంతృప్తి కల్గించండి. అప్పుడే మీకు దైవం సహాయం చేస్తాడు. ప్రతి ఒక్కరూ స్వదేశాన్ని Motherland అంటారు. గాని, Fatherland అని అనరు. అనగా దేశం తల్లివంటిది. కనుక తల్లిని ప్రేమించినట్లుగా మాతృదేశాన్నికూడా ప్రేమించి, సంరక్షించి, దేశాభివృద్ధికి పాటుపడండి. ఈనాటి ప్రధానమైన సందేశం ఇదే.

ఇంక కొద్ది నిమిషాలలో పి. సుశీల, ఆమె కోడలు తదితరులు ఒక భక్తిసంగీత కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వారు గత 40 సంవత్సరాలుగా స్వామిభక్తులు. సుశీలకు పిల్లలు లేనప్పుడు నేనొక కొడుకునిచ్చాను. ఆ కొడుకు పెళ్ళికూడా నేనే చేశాను. ఆమెకు వచ్చిన కోడలుకూడా సంగీత విద్వాంసురాలే. వీళ్ళందరూ ఈనాడు ఇక్కడికి వచ్చారు; అందరినీ ఆనందపరచే నిమిత్తం కొన్ని పాటలు పాడతారు. ఆనందంగా వినండి. తరువాత కళ్యాణమండపంలో బాలవికాస్ పిల్లల డ్రామాకూడా ఉంటుంది. ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేయటం ఎందుకో తెలుసునా? మనిషి మనస్సు చాలా చంచలమైనది, పిచ్చికోతివంటిది. ఇలాంటి మనస్సును అరికట్టే నిమిత్తమై ఈ సంభాషణలు, ఈ సంగీత కార్యక్రమాలు, పవిత్రమైన ప్రార్థనలు చాలా అవసరం. దేహం ఒక నీటిబుడగవంటిది. మనస్సొక పిచ్చికోతివంటిది. కాబట్టి దేహాన్ని, మనస్సును అనుసరించకండి. అంతరాత్మను అనుసరించండి.

(06-05-2001 సాయంత్రం సాయి రమేశ్ క్రిషన్ హాల్, బృందావనంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)

sri sathyasai vachanamrutam